క్లుప్తంగా

యువతికి సాయం అందజేత



అప్పనపల్లిలో యువతికి సాయం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

మామిడికుదురు: అనారోగ్యంతో బాధపడుతున్న అప్పనపల్లికి చెందిన యువతి ఉండ్రు ధనలక్ష్మికి పలువురు దాతలు రూ.40 వేల ఆర్థిక సాయం అందించారు. సోషల్ మీడియాతో పాటు పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందించిన దాతలు ఇండియన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా ఈ సహాయం అందించారు. దాతలు అందించిన మొత్తాన్ని ఆర్గనైజేషన్ ప్రతినిధులు యువతి కుటుంబ సభ్యులకు అందజేశారు. తాడి శ్రీను రూ.10 వేలు, మత్తి జాన్సన్ రూ.10 వేలు, మట్టా రాకేష్ రూ.5 వేలు, మగటపల్లి అంబేడ్కర్ యూత్ రూ.3100, ఇతర దాతలు సహాయం అందించారని ఆర్గనైజేషన్ ప్రతినిధులు తెలిపారు. కష్టాలో ఉన్న యువతి కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదంలో గాయపడిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శనివారం రూ.11 వేల చెక్కును ఆర్థిక సాయంగా అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవు మండలం గాడిమొగకి చెందిన అంగాడి నూకరాజు రొయ్యల కంపెనీలో పని చేసేవారు. రెండు నెలల క్రితం కంపెనీ పని మీద వ్యాన్‌లో వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు, నడుము కింది భాగంలో విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డారు. కంపెనీ వాళ్లు సగం ఖర్చు పెట్టుకోగా మిగిలింది అప్పు చేసి వైద్యం చేయించారు. ఇప్పుడు ఇంటి దగ్గర మంచం మీదే ఉంటున్నారు. కోలుకుని నడవడానికి సంవత్సరం పడుతుందని డాక్టర్లు చెప్పారు. పనికి వెళితేనే కానీ ఇల్లు గడవని పరిస్థితి వారిది. దీంతో కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో నూక రాజు మావయ్య వల్లేటి శ్రీనివాస్‌కి సంస్థ సభ్యుల చేతులు మీదుగా రూ.11 వేల చెక్కు అందజేశారు.

హృద్రోగికి సాయం

కొత్తపేట: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మెకానిక్ సలాది నాగేశ్వరరావుకు రావులపాలెం సిద్ధి వినాయక మోటార్ వర్కర్స్ యూనియన్ సభ్యులు రూ.5 వేల సాయం అందజేశారు. ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో నాగేశ్వరరావు అనారోగ్యానికి గురయ్యారు. ఆయన ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో వైద్య ఖర్చుల నిమిత్తం రావులపాలెం మోటార్ వర్కర్స్ యూనియన్ వారు ఆర్థిక సాయం చేసినట్టు నాగేశ్వరరావు చెప్పారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత బస్సు హామీని ప్రభుత్వం విస్మరించింది



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న చిట్టిబాబు

మామిడికుదురు: ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు హామీని కూటమి ప్రభుత్వం విస్మరించిందని కోనసీమ జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆయన పార్టీ శ్రేణులతో కలసి ఆదివారం నగరం నుంచి పాశర్లపూడి వరకు టికెట్ కొని ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. 'మీ సర్కారు కొలువుతీరి నాలుగు నెలలు నిండింది. మీ సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు వాగ్దానం అమలు జరగక, మేము తీవ్ర నిరాశతో ఉన్నాం. దీనిపై స్పష్టత పక్కన పెడితే, కనీసం దీని గురించి కూడా మీరు మాట్లాడకపోవడం మోసం కాదా.. మా ఆవేదన అర్థం చేసుకుని వెంటనే ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయాలని మా విజ్ఞప్తి' అంటూ బస్సులో మహిళలతో సీఎం చంద్రబాబుకు పోస్టు కార్డులు రాయించారు. ఇప్పటికైనా దీనిపై సీఎం చంద్రబాబు స్పందించాలని చిట్టిబాబు డిమాండ్ చేశారు.

కృష్ణమందిర్‌లో విశేష పూజలు

అయినవిల్లి: నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్‌లో ఆదివారం మందిర నిర్వాహకుడు శ్రీసుందర శ్రీనివాసదాస్ ప్రభుజీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామికి సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభుజీ శ్రీకృష్ణ అవతార రహస్యాన్ని వివరించారు. ఒక్కో అవతారంలో శ్రీకృష్ణుని తత్వం బోధిస్తుందన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రభాపతిదాసు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

స్వాములకు సేవా సుభిక్ష

- గ్రామగ్రామానా కొనసాగుతున్న అయ్యప్ప దీక్ష
- మాలధారులకు ఉచిత అన్న ప్రసాదం
- దాతల సహకారంతో వందలాది మందికి భిక్ష



కొత్తపేట గౌతమి అయ్యప్పస్వామి ఆలయం



కొత్తపేట గౌతమి అయ్యప్పస్వామి ఆలయంలో భిక్ష స్వీకరిస్తున్న మాలధారులు

కొత్తపేట: స్వామియే శరణం అయ్యప్ప.. అంటూ గ్రామగ్రామానా అయ్యప్ప స్వామి భక్తులు 41 రోజుల మండల దీక్ష చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో కొన్ని సంవత్సరాల క్రితం అయ్యప్ప స్వామి భక్తులు అయ్యప్ప ఆలయాలను నిర్మించారు. ఏటా దసరా రోజుల్లో మండల దీక్ష, తరువాత జ్యోతి దర్శన దీక్ష చేపడతారు. అలా నియోజకవర్గంలో ప్రస్తుతం వేలాది మంది భక్తులు మండల దీక్ష కొనసాగిస్తున్నారు. అన్ని దేవతా మూర్తులను ఆరాధిస్తూ చేపట్టే దీక్షల కంటే ఎంతో కఠినమైన దీక్ష ఈ అయ్యప్ప దీక్ష. మాల ధరించింది మొదలు దీక్ష పూర్తయ్యే వరకూ ఏకభుక్తం (ఒక్క పూట భోజనం) మాత్రమే చేయాలి. ఇంట్లో అన్ని రోజులు నియమాలతో ఆహారం తయారుచేయడం కుదరదు. దీంతో చాలా మంది భక్తులు బృందంగా ఏర్పడి స్వయంగా వండుకుంటారు. అలా కుదరని వారు ప్రత్యేకంగా మడిగా ఉండే వంట మనుషులతో ఉదయం, రాత్రి ఒడి (అల్పాహారం), మధ్యాహ్నం భిక్ష (భోజనం) తయారు చేయించుకుని స్వీకరిస్తారు. మరికొందరు స్వామిపై భక్తితో మాల ధరిస్తారు కానీ వారికి మడిగా ఒడి, భిక్ష తయారు చేసుకునే అవకాశం ఉండదు. ఉద్యోగ, ఉపాధి, వివిధ పనుల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. అటువంటి వారు భిక్ష లేక ఆ పూట ఉపవాసం ఉండాల్సిన పరిస్థితి. అటువంటి వారి కోసం ఒడి, భిక్ష పలు ప్రాంతాల్లో అయ్యప్ప స్వామి ఆలయాల కమిటీలు ఉచిత ఒడి, భిక్ష అందిస్తూ స్వామి సేవలో తరిస్తున్నారు. వాడపాలెం అయ్యప్పస్వామి-జ్ఞాన సరస్వతీదేవి ఆలయం కోనసీమ శబరిమల ఆలయంగా విరాజిల్లుతోంది. ఈ ఆలయం ద్వారా సుమారు 200 మంది మాల ధరించారు. ఆ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గత కొన్నేళ్ల నుంచి ఉచిత భిక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఏటా మండల దీక్ష భక్తులకు 41 రోజుల పాటు మధ్యాహ్న భోజనం ఉచితంగా వడ్డిస్తున్నారు. రోజూ మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకూ సుమారు 300 మంది మాలధారులు అక్కడ భిక్ష స్వీకరిస్తున్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి ముగ్ధులైన పలువురు భక్తులు వివిధ రూపాల్లో సహకరిస్తున్నారు. కొత్తపేట బోడిపాలెం వంతెన వద్ద గౌతమి అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి రోజూ మధ్యాహ్నం ఉచిత భిక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ సుమారు 250 మంది స్థానిక, స్థానికేతర భక్తులు ఉచిత భిక్ష స్వీకరిస్తున్నారు. పలువురు భక్తులు అయ్యప్ప మాలధారుల బృందాన్ని ఒకరోజు భిక్ష, ఒడి స్వీకరించాలని ఆహ్వానిస్తున్నారు. అలా వచ్చిన వారిని దైవంగా భావించి, భిక్ష, ఒడి స్వీకరణ అనంతరం తాంబూలం, పండ్లు సమర్పించి సాగనంపుతున్నారు.

గొప్ప సేవా కార్యక్రమం



41 రోజుల అయ్యప్ప దీక్ష ద్వారా మనిషిలో భక్తి భావం కలగటమే కాక శారీరకంగా, మానసికంగా మార్పులతో పరిపక్వత చెందుతారు. కులం, పేద, ధనిక అనే తేడా లేకుండా అందరం సమానమనే భావన కలుగుతుంది. ముఖ్యంగా అయ్యప్ప దీక్ష చేపట్టిన మాలధారులకు ఉచిత భిక్ష అనేది గొప్ప బృహత్తర కార్యక్రమం. ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న ప్రతి ఒక్కరూ అభినందనీయులు.

– డి.రామచంద్రశర్మ, అయ్యప్ప ఆలయ అర్చకుడు, వాడపాలెం

అదృష్టంగా భావిస్తున్నాం



సాటి అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాదం (భిక్ష) వండి వడ్డించే కార్యక్రమం ఏటా నిరాటంకంగా సాగుతోంది. స్థానికంగా ఇంట్లో మడిగా భిక్షకు అవకాశం లేని అనేకమంది మాలధారులకు, ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధి రీత్యా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే స్వాములకు అన్నప్రసాదం అందించడం అదృష్టంగా భావిస్తున్నాం.

– మట్టా బాబ్జీ, ఆలయ ఇన్‌చార్జ్, వాడపాలెం

తోడైన దాతల సహకారం



అయ్యప్పస్వాములు అన్నప్రసాద (భిక్ష) సేవలో తరిస్తున్నాం. ఈ ఉచిత భిక్ష కార్యక్రమాన్ని తొలుత ఆలయ కమిటీ సభ్యుల సహకారంతో శ్రీకారం చుట్టాం. తరువాత దాతల సహకారం తోడైంది. సహకరిస్తున్న అయ్యప్ప భక్తులు, దాతలందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం.

– దేశంశెట్టి శ్రీనివాస్, సభ్యుడు, కొత్తపేట

నిత్యాన్నదానానికి విరాళం



దాత శ్రీనివాస్ దంపతులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన పసుపులేటి శ్రీనివాస్–శుభ వైష్ణవిలక్ష్మి దంపతులు రూ.10116 ఆదివారం విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులకు అందజేశారు. దాతకు వేదాశీర్వదం పలికి, స్వామి శేషవస్త్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను పలువురు అభినదించారు.

పాఠశాల అభివృద్ధి పనుల జాప్యంపై ఫిర్యాదు

ఆలమూరు: స్థానిక బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాల అభివృద్ధికి నిధులు ఉన్నా పనుల్లో జరుగుతున్న జాప్యంపై కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు ఫిర్యాదు అందింది. గ్రామంలో ఆదివారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు విద్యా కమిటీ చైర్‌పర్సన్ ఇందుగుల సుబ్బలక్ష్మి ఫిర్యాదు చేశారు. పాఠశాల అభివృద్ధికి కేటాయించిన నాడు–నేడు నిధులను ఏ విధమైన పనులు చేపట్టకుండానే నాలుగు నెలల క్రితమే విత్ డ్రా చేసినట్లు రికార్డులో ఉందని ఆమె ఆరోపించారు. అయినా ఇప్పటి వరకూ ఒక పైసా కూడా ఖర్చు చేయకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొద్దిపాటి వర్షానికే పాఠశాల ఆవరణ అంతా బురదగా మారుతుందన్నారు. అలాగే పాఠశాలలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంతో నిర్వాహకులు విఫలమయ్యారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జాన్‌లింకన్‌ను ఎమ్మెల్యే బండారు ఆదేశించారు.

గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి



కె.ఏనుగుపల్లిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



గోగన్నమఠంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



సంధిపూడిలో సీసీ రోడ్డు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

పి.గన్నవరం: గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని కె.ముంజవరం, ఆర్.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి, కె.ఏనుగుపల్లి, ఎల్.గన్నవరం, మొండెపులంక, వాడ్రేవుపల్లి, నాగుల్లంక గ్రామాల్లో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న 15 సీసీ రోడ్ల పనులకు ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీఓ కేఎస్ ప్రసాద్, పీఆర్ జేఈ ఆనంద్, సర్పంచ్‌లు కుంపట్ల నాగలక్ష్మి, దొమ్మేటి పార్వతి, తోలేటి బంగారునాయుడు, నాయకులు పాల్గొన్నారు.

ఖండ్రిగలో..

కొత్తపేట: గ్రామాల్లో రోడ్లు, డ్రెన్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం మండలంలోని ఖండ్రిగలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే బండారు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ దూనబోయిన నవదీప అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే సత్యానందరావు విశిష్ట అతిథిగా, ఎంపీపీ మార్గన గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధే లక్ష్యంగా ఈ ప్రభుత్వం ప్రత్యేకంగా వారం రోజుల పాటు పల్లె పండుగ పేరుతో గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పితాని లక్ష్మీతులసి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు రెడ్డి రామకృష్ణ, దర్నాల రామకృష్ణ, గ్రామ వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: రాష్ట్రంలో ఎన్డీఏ పాలన ఆదర్శవంతంగా సాగుతుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. గెద్దాడ, మామిడికుదురు, కొమరాడ, మగటపల్లి, గోగన్నమఠం, కరవాక గ్రామాల్లో ఆదివారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.73 లక్షలతో నిర్మించనున్న 12 సిమెంట్ కాంక్రీట్ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో మాట్లాడారు. విద్యుత్ లో–ఓల్టేజ్, తాగునీరు, డ్రైనేజ్ వంటి ప్రధాన సమస్యలపై మాట్లాడారు. గ్రామాల వారీగా సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నామన రాంబాబు, సర్పంచ్‌లు గౌస్ మొహిద్దీన్, అల్లు విజయలక్ష్మి, కూటమి నేతలు గుండుబోగుల పెదకాపు, మొల్లేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: గ్రామాల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసు అన్నారు. మండలంలోని సంధిపూడి, పినపళ్ల, పెదపళ్ల, గుమ్మిలేరు, పెనికేరు, ఆలమూరు గ్రామాల్లో ఆదివారం తుది విడత పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమం జరిగింది. ఆయా గ్రామాల్లో రూ.1.95 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు వారిద్దరూ భూమి పూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. వచ్చే సంక్రాంతి నాటికి చేపట్టిన పనులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్‌లు నేలపూడి లావణ్య, సంగిత సుభాష్, తోట భవాని, యేడిద సత్యశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు నిత్యావసరాల పంపిణీ



శాంతి సదన్‌లో నిత్యావసరాలు అందుకున్న పిల్లలతో ట్రస్టు సభ్యులు

సఖినేటిపల్లి: స్థానిక శాంతి సదన్ హాస్టల్లో ఉన్న పిల్లలకు ఆదివారం షాలోమ్ ఇజ్రాయేల్ చారిటబుల్ ట్రస్టు ద్వారా నిత్యావసరాలను పంపిణీ చేశారు. పర్ణశాలల పండుగ సందర్భంగా ట్రస్టు ద్వారా నిర్వాహకులు పై పంపిణీని చేపట్టారు. తాడి సహదేవ్, బాలు, వినోద్, మెస్సయ్య సమాజం, కేవీ పోడు షాలోమ్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడి మృతి



మంగెన ముత్యాలు (ఫైల్)

మలికిపురం: మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మంగెన ముత్యాలు(74) ఆదివారం మృతి చెందారు. స్థానిక సొసైటీ అధ్యక్షుడిగా ఆయన మూడుసార్లు పని చేశారు. ఆయన మృతికి వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తదితరులు సంతాపం తెలిపారు.

లక్ష్మీనృసింహుని సన్నిధికి పోటెత్తిన భక్తులు



అంతర్వేది ఆలయంలో ఎంత పని చేసావ్ చంటి చిత్రం పోస్టర్ ఆవిష్కరించిన యూనిట్ సభ్యులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పిల్లాపాపలతో స్వామి వారిని దర్శనానికి తరలి వచ్చారు. ఆలయంలో నిర్వహించిన నారసింహ సుదర్శన హోమంలోనూ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. సుమారు 4 వేల మంది సాధారణ, ప్రత్యేక దర్శనాల ద్వారా స్వామిని దర్శించుకున్నట్టు దేవస్థానం తెలిపింది. దర్శనం అనంతరం భక్తులకు నిత్యాన్నదానంలో భోజన సౌకర్యం దేవస్థానం సిబ్బంది కల్పించారు. భక్తుల భోజన వసతిని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు.

స్వామికి ప్రత్యేక పూజలు

ఈ నెల 25న విడుదల చేయనున్న నూతన చిత్రం 'ఎంత పని చేశావ్ చంటి' విజయవంతం కావాలని ప్రార్థిస్తూ పీజేకే బ్యానర్ యూనిట్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఈ మేరకు నటీనటులతో కూడిన యూనిట్, చిత్రం పోస్టర్‌ను ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించింది. హీరో శ్రీనివాస్ ఉలిశెట్టి, నీహారిక కేశవ్, శాంతి ప్రియ, పటాన్ జిలాన్ ఖాన్ తదితర నటులతో, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ ఉదయ్ కుమార్.ఆర్ నిర్మాతలుగా లడ్డే బ్రదర్స్ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు.

29న ఆర్జిత సేవగా శాంతి కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఈ నెల 29న బహుళ ద్వాదశి పర్వదినాన ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. కల్యాణం టికెట్లు ముందస్తు బుకింగ్‌ను టెంపుల్ వెబ్‌సైటు ద్వారాను, ఆలయం వద్ద కౌంటర్ నందు తీసుకోవచ్చని ఆయన అన్నారు.

నేడు మోరిలో 1008 కలశల పూజ

మోరి వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయం వద్ద సోమవారం పేరాబత్తుల సుబ్బారాయుడు గురుస్వామి పీఠం ఆధ్వర్యంలో పల్లపోతు పూర్ణయ్య గురుస్వామి పర్యవేక్షణలో అయ్యప్ప భక్తులు 1008 కలశల పూజ నిర్వహించనున్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లను పీఠం ఆదివారం పూర్తి చేసింది.

కమ్యూనిటీ భవనాన్ని పూర్తి చేయాలి



ఇసుకపూడిలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఎస్సీ కమ్యూనిటీ భవనం

అంబాజీపేట: ఇసుకపూడి శివారు దాసరివారిపేటలో అసంపూర్తిగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీ భవనానికి నిధులు కేటాయించి నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. 2009లో సామాజిక భవనాన్ని నిర్మించేందుకు నిధులు రూ.5 లక్షలు మంజూరు చేశారు. అయితే ఆ నిధులు సరిపడక అసంపూర్తిగా నిర్మించి గాలికొదిలేశారు. అప్పటి నుండి భవనాన్ని నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్న పట్టించుకున్న దాఖలాలు లేవు. అసంపూర్తిగా ఉన్న ఈ భవనం వినియోగంలో లేకపోవడంతో శిథిలస్థితికి చేరుతుంది. తక్షణమే భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

సభ్యత్వాల నమోదుపై దృష్టి సారించాలి

మామిడికుదురు: బీజేపీ సభ్యత్వాల నమోదుపై పార్టీ శ్రేణులు దృష్టి సారించాలని ఈ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. మామిడికుదురులో ఆదివారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశానికి మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ అధ్యక్షత వహించారు. పార్టీ సభ్యత్వాల నమోదుతో పాటు క్రియాశీలక సభ్యత్వాల నమోదు కోసం కృషి చేయాలని వేమా సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలన్నారు. సమావేశంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.